# పేయింగ్ గెస్ట్

సుందరి ఎంతో అమాయకురాలు. చాలా భయస్తురాలు. ఆమెకు పిరికితనం పుట్టుకతోనే వచ్చింది. ఆమె అమాయకత్వం వల్ల అటు బాల్యంలోనూ ఇటు పెద్దయ్యాక ఎన్నో విధాలుగా నష్టపోయింది. అవమానాలు పొందింది. ఈసడింపులకు గురైంది.

రామ్మూర్తి మాస్టారి మూడో కూతురు సుందరి. ఆయనకు పురుష సంతతి లేదు. ముగ్గురూ ఆడపిల్లలే. సుందరి పేరుకి తగ్గట్టుగానే అందాలరాశి. అయితే ఆమెకున్న ఒకే ఒక లోపం అమాయకత్వం. గడుసుతనం లేనందువల్ల సరదాలకూ ముద్దూ ముచ్చట్లకూ దూరమైంది.

సుందరి అక్కలిద్దరూ చురుకైన వాళ్లు. తోటి పిల్లలతో ఆట పాటలతో సరదాగా కాలక్షేపం చేస్తూ చెల్లెలి చేత వారి పనులన్నీ చేయించేవారు. సుందరి స్కూలు నుంచి వచ్చి తల్లికి వంట పని, ఇంటిపనుల్లో చేతనైన సాయం చేసి తీరిక సమయంలో క్లాసు పుస్తకాలు చదువుకొనేది. ఆటపాటల జోలికి వెళ్లేది కాదు. తల్లిదండ్రులు ముగ్గురు కూతుళ్లకీ సమానంగా బట్టలు కొనేవారు. ఆట వస్తువులు సమకూర్చేవాళ్లు. అయితే సుందరి అక్కలిద్దరూ మంచి మాటలతో చెల్లెల్ని బుజ్జగించి ఆమె వస్తువులను వాడుతూ వారివి దాచుకునేవారు. ఆమె కొత్త బట్టలు వారు ముందుగా వేసుకొని తరువాతనే ఆమెకిచ్చేవారు. వారికి కురచైన గౌన్లూ, లంగాలూ చెల్లెలికిచ్చేవారు.

తల్లిదండ్రులను సుందరి ఏనాడూ ఫలానా వస్తువు తనకు కావాలని నోరు విప్పి అడగలేదు. ఏ విషయంలోనూ అక్కలతో పోటీపడలేదు. ఈసు చెందలేదు. పిరికితనం, అమాయకత్వం విడనాడి కాస్తంత చురుకుగా మసలుకోమని తల్లిదండ్రులు ఆమెకు ఎన్నో విధాలుగా చెప్పేరు.

రామ్మూర్తిగారు పెద్దకూతురికీ, రెండో అమ్మాయికీ పై సంబంధాలు చేసేరు. సుందర్ని తన మేనల్లుడు గోపాలానికిచ్చి పెళ్ళిచేసేరు. గోపాలానికి సుందరి మనస్తత్వం తెలుసు. అతను ఎంతో చురుకైనవాడు. గవర్నమెంట్ ఉద్యోగి. రెండుచేతులా సంపాదించగల నేర్పరి.

ఎవరిని ఏ విధంగా లొంగదీయాలో అతనికి బాగా తెలుసు. అందుచేత భార్య అమాయకత్వం పిరికితనాల గురించి అతను ఏమాత్రం పట్టించుకోలేదు.

భార్యను తీసుకొని వెళ్లి వేరే కాపురం పెట్టేడు గోపాలం. ఆ ఇంట్లో వీరుగాక మరో నాలుగు కుటుంబాల వారు వేరు వేరు పోర్షన్లలో అద్దెకుంటున్నారు. వీరు ఇంట్లో దిగిన వెంటనే మిగిలిన పోర్షన్ల వారందరూ వచ్చి తమను పరిచయం చేసుకొని నూతన దంపతులను అభినందించి, వారికి ఎప్పుడు ఏ సహాయం కావాల్సినా తామున్నామని భరోసా యిచ్చేరు. ఇరుగుపొరుగు వారి మంచి మాటలకూ ఆప్యాయతకూ సుందరి ఆనందంతో పొంగిపోయింది.

గోపాలం నెల జీతం లోంచి వేయి రూపాయలు బేంక్‌లో వేసి మిగిలిన సొమ్మంతా భార్యకిచ్చేడు. ఇంటి అద్దె, కరెంట్, పాలవాడికి, పనిమనిషికి, భార్య చేత పేమెంట్ చేయించేడు. భార్యను నెలకు కావలసిన సరుకుల లిస్ట్ తయారు చేయమని ఆమెను బజారుకి తీసుకొని వెళ్ళి నాణ్యమైన సరుకులు కొని ఇంట్లో పెట్టించేడు. ఖర్చులన్నీ పోను సుందరి వద్ద మిగిలిన పైకం రూ. 600/- దానితో ప్రతిరోజూ కావాల్సిన కాయకూరలు, చిల్లర ఖర్చులు వగైరా నెలంతా నెట్టుకురావాలని, తను రోజూ ఆఫీసుకి బస్సులో వెళ్లి వచ్చేందుకు రోజుకు రూ.5/- ఖర్చు కూడా అందులోంచి అని చెప్పేడు గోపాలం.

సుందరికి అంతా ఎంతో థ్రిల్లింగ్‌గా వుంది. ఈనాటి వరకూ ఆమె తన చేత్తో దేనికీ రూపాయి ఖర్చు చేసి ఎరగదు. ఆమె అవసరాలకు కావాల్సిన వన్నీ అక్కలు, తల్లిదండ్రులు కొనేవారు. అటువంటిది యీరోజు ఆమె చేతిలో పుష్కలంగా డబ్బుంది. కోరిన విధంగా ఖర్చు చెయ్యొచ్చు. భర్త జీతం అంతా తెచ్చి తనకిస్తున్నాడు అనుకుంది.

గోపాలం ఆఫీసుకు వెళ్లగానే పక్క పోర్షన్‌లో వుంటున్న కాంతమ్మగారు వచ్చేరు.

"ఏం చేస్తున్నావ్ అమ్మాయి! అల్లుడుగారు ఆఫీసుకు వెళ్లిపోయేరా?" అంది.

"ఇప్పుడే వెళ్లేరు పిన్నిగారూ రండి కూర్చోండి" అంది సుందరి.

"మరేం లేదమ్మాయి! మీ బాబాయిగారు కేంపు నుంచి నిన్న ఉదయానికే వస్తానని చెప్పి ఇంత వరకూ రాలేదు. మా అమ్మాయి పరీక్ష ఫీజు కట్టడానికి ఈ రోజే ఆఖరు. అది కూడా 12 గంటల లోపున కట్టాలిట. నీ దగ్గర మూడు వందలుంటే సర్దుతావూ! మీ బాబాయిగారు వచ్చిన వెంటనే తిరిగిచ్చేస్తాను. లేకుంటే ఏడాది పొడుగునా చదివిన చదువంతా వృథా అవుతుంది" అన్నారు.

"దాందేముంది ఇస్తాను తీసుకొని వెళ్లండి!" అంది. అంత పెద్దావిడ ఇంటికి వచ్చి ఎంతో ప్రాధేయపడి అడగడంతో లేదని చెప్పలేకపోయింది అమాయకురాలు సుందరి. పెట్లోంచి

తీసి మూడు వంద రూపాయలనోట్లు ఆమెకిచ్చింది.

కాంతమ్మగారు సుందరిని కాస్సేపు పొగిడి "మీ బాబాయిగారు వచ్చిన వెంటనే యిచ్చేస్తానని" చెప్పి వెళ్లిపోయేరు.

ఆవిడ వెళ్లగానే మురికి బట్టలన్నీ ఉతికి ఆరవేసి కాసేపు నడుం వాల్చింది సుందరి. అంతలో బయట కేకలు వినిపించేయి. ఏమిటో అని తలుపు తెరిచి చూసింది. గ్యాస్ సిలెండరు తెచ్చిన వాడితో మంగమ్మ గారు గొడవపడుతున్నారు.

"పది సుట్లు సిలిండరు సంకలో పెట్టుకొని మీ ఇంటి సుట్టూ తిరగవండీ! గేసుబుక్కు చేసిన దినవే సెప్పేవండి! ఈ పొద్దు సిలిండరు వొట్టుకొత్తానని. మీరు ఇడిపించుగుంటారో వాపసు వొట్టికెళ్ళిపోవాలో బేగి సెప్పండి." అన్నాడు వాడు.

మంగమ్మగారు వాడికి నచ్చచెప్పబోయేరు. వాడు వినలేదు. చివరకు ఆవిడ సుందరి దగ్గరకు వచ్చి

"చూసేవా అమ్మాయి! వాడి అధార్టీ! మీ అన్నయ్యగారి నిర్వాకం! ఈ రోజు గ్యాస్ తెస్తానని చెప్పేడుట. నా చేతికి డబ్బివ్వడం మర్చిపోయి ఆఫీసుకు వెళ్లిపోయేరు. సిలెండరు కాళీ అయి వారం రోజులైంది. కిరోసిన్ స్టౌ మీద వండలేక ఛస్తున్నాను. వేళకు వంటకాకపోతే కేకలు వెయ్యడం తెల్సు. వంటింట్లో ఆడవాళ్ల ఆవేదన వారికి పట్టదు. నీ దగ్గర 150 రూపాయలుంటే ఇవ్వు సాయంత్రం మీ అన్నయ్యగారు వచ్చిన వెంటనే ఇచ్చేస్తాను" అన్నారు.

సుందరి జాలి గుండె కాదనలేక ఆవిడకు 150 రూపాయలు ఇచ్చింది.

"నెల పొడవునా భర్త బస్సు ఛార్జీలకూ, కూరగాయలకు, చిల్లర ఖర్చుల నిమిత్తం ఉంచిన ఆరు వందల్లో ఇరుగుపొరుగువారు చేబదుళ్లక్రింద నాలుగు వందల ఏభై రూపాయలు పట్టుకుపోయేరు" అనుకుంది.

సాయంత్రం భర్త ఆఫీసునుంచి వచ్చిన వెంటనే కాంతమ్మ గారికి, మంగమ్మగారికీ వచ్చిన ఇక్కట్లను వివరించి వారికిచ్చిన చేబదులు గురించి చెప్పింది.

"ఇరుగూ పొరుగున వుండే వాళ్ళం! ఒకళ్లకొకళ్లం సహాయం చేసుకోకుండా ఎలా? చెప్పండీ" అంది కాఫీ గ్లాసు అందిస్తూ.

గోపాలం సమాధానం చెప్పలేదు. చిరునవ్వు నవ్వి వూరుకొని భార్య ఇచ్చిన కాఫీ త్రాగి ఆమెను కాయకూరల మార్కెట్‌కి తీసుకొని వెళ్లేడు.

మర్నాడుదయం యింకో వాటాలో వుండే పున్నమ్మగారు వచ్చి పావుశేరు పంచదార, నాలుగో వాటాలో వున్న అరుంధతి గారు ఆరుపావుల బియ్యం అప్పుగా తీసుకొని వెళ్లేరు

సుందరి వద్ద.

అయితే అరుంధతి గారు మాత్రమే మాట నిలబెట్టుకున్నారు.

అప్పుగా తీసుకొని వెళ్లిన ఆరుపావుల బియ్యం తెచ్చి బదులు తీర్చేరు. ఆవిడబదులు తీర్చిన బియ్యం చూడగానే సుందరి వదనం ముడుచుకుపోయింది. అరుంధతిగారికి అప్పుగా ఇచ్చిన బియ్యం కేజి 12 రూపాయల రకం. ఆవిడ బదులు తీర్చినవి కేజీ మూడున్నర రకం బియ్యం.

వారం రోజులు గడిచినా కాంతమ్మగారు కాని మంగమ్మగారుకానీ చేబదులుగా తీసుకున్న సొమ్ము తిరిగి ఇవ్వలేదు. పున్నమ్మగారు పంచదార బాకీ తీర్చలేదు. సుందరికి ఏం చెయ్యాలో తెలియటం లేదు. బాకీ తీర్చమని అడిగితే ఏమనుకుంటారోనన్న భయం! వారు బాకీ తీర్చకుంటే ఎంతో ఇబ్బంది పడాలనే దిగులు.

కాంతమ్మగారూ, మంగమ్మగారూ పిల్లలతో తరచు ఆటోల్లో సినీమాలకు, ఎగ్జిబిషన్లకూ, వినోదాలకూ డబ్బులు ఖర్చుపెట్టడం సుందరి గమనించింది. ఆమె బాకీ విషయం వారు పట్టించుకోవటం లేదు.

చివరకు సుందరి భయపడినట్లే అయింది. ఇరవయ్యో తారీఖు వచ్చేసరికి ఆమె వద్దనున్న పైకం ఖర్చయిపోయింది. చేబదులు తీసుకున్నవారు బాకీ తీర్చలేదు. అందువల్ల కాయకూరలు కొనడానికి డబ్బు లేక భర్తకి ఆమె వారం రోజులు పచ్చడి మెతుకులు, కందిపొడితో భోజనం పెట్టాల్సి వచ్చింది. అంతేకాదు గోపాలం పదిరోజులు ఆఫీసుకి కాలినడకనే వెళ్లి రావాల్సి వచ్చింది.

ఎంత ఇబ్బంది పడుతున్నా గోపాలం భార్యను పల్లెత్తుమాటనలేదు. కనీసం విసుక్కోలేదు.

'తన వల్ల భర్త ఇబ్బందులకు గురికావల్సి వచ్చింది' అని సుందరి బాధపడింది. సహించలేకపోయింది. ఆమెలో ఆవేశం కట్టలు తెంచుకుని ఆడపులిలా విజృంభించింది. వెళ్లి బాకీలు వసూలు చేసుకొని వచ్చింది.

'ఇరుగు పొరుగు అన్నాక ఏవో అవసరాలురాక మానవు. డబ్బు చేబదులు ఇచ్చి పుచ్చుకోవడం, సరుకులు అప్పుగా తీసుకొని తీర్చడాలు సర్వసాధారణమే! అయితే కొందరు డబ్బు, సరుకులు తీసుకొని వెళ్లి వాటిని తిరిగి ఇవ్వరు. వారు మరిచిపోయేరేమోనని వెళ్లి అడిగితే చీదరించుకొని తూలనాడుతారు. అటువంటి వారి విషయంలో ఎంతో అప్రమత్తంగా వుండాలి. సుందరి అసలే అమాయకురాలు. పైగా జాలి గుండె ఆమెది. ఎదుటివారి కష్టాలు చూడలేదు. ఆమెకు ఏ విషయమైనా థియరిటికల్‌గా చెప్తే అర్థం కాదు. ఇలా ప్రాక్టికల్‌గా

అనుభవంలోకి వస్తేకాని తెలియదు' అని అనుకున్నాడు గోపాలం.

బాకీ వసూలు చేసుకొని వచ్చిన భార్యను అభినందించేడు.

"మనం మధ్య తరగతి కుటుంబీకులం! ఏవో అవసరాలు వుంటాయి. ఇరుగుపొరుగులవారిని ఆదుకోవాలి! అయితే అదే ఆసరాగా అమాయకులను అణగద్రొక్కాలనుకునేవారిని ఉపేక్షించకూడదు!" అన్నాడు.

గోపాలం సర్వీసులో వుండగానే రెండు పోర్షన్స్ వున్న డాబా ఇల్లు భార్య పేరున కొన్నాడు. సుందరికి ఇల్లు ఎంతో నచ్చింది. ఆమె ఆనందానికిక అంతులేదు. కొడుకులిద్దరూ డిగ్రీ పూర్తిచేసేరు. గోపాలం వారికి ఉన్నవూళ్లోనే ఉద్యోగాలు వేయించేడు. వారు కోరుకున్న అమ్మాయిలనే పెళ్లిచేసేడు.

కోడళ్ళిద్దరూ చదువుకున్నవాళ్లు తెలివైన వాళ్ళు. అత్తగారి అమాయకత్వం పసికట్టేరు. వారు ఏ పనీ ముట్టుకొనక అత్తగారిని మంచి మాటలతో పొగడుతూ ఆమె చేత పనులన్నీ చేయిస్తున్నారు.

భర్త రిటైర్ అయేసరికి కొడుకులిద్దరూ ఉద్యోగస్తులవడం వల్ల భర్తకు లభించే పెన్షన్, కొడుకుల జీతాలు కలిపి ఎంతో హాయిగా కాలం వెళ్లబుచ్చవచ్చునని, కోడళ్ల రాకతో తనకు కూడా కొంత విశ్రాంతి దొరకవచ్చునని సంతోషపడింది సుందరి.

అయితే ఆమె తలచినట్లు ఏదీ జరుగలేదు. కొడుకులిద్దరూ పెళ్లయ్యేవరకూ వారి నెలజీతం తెచ్చి తల్లికిచ్చేవారు. వారి అవసరాలకు అవసరమైన సొమ్ము అడపాదడపా తల్లిని అడిగి తీసుకునేవారు. వారికి పెళ్లయిన తరువాత వారు ఇంటి ఖర్చులకైనా పైసా తల్లి చేతికివ్వటం లేదు.

కోడళ్లు రావడంతో కుటుంబ సభ్యులు మరో ఇద్దరు అధికమవడం వల్ల ఇంటి ఖర్చులు పెరిగేయి. పనీ ఎక్కువైంది. గోపాలానికి భార్య తత్వం తెలుసు. కొడుకులను ఇంటి ఖర్చులకు డబ్బు అడగదు. అందువల్ల గోపాలం నెలకు మూడు వేలు వచ్చే పార్టయిమ్ జాబ్స్‌లో చేరేడు. ఆ సొమ్ము కూడా అతని పెన్షన్‌తోపాటు ఇంటి ఖర్చులకిస్తున్నాడు భార్యకు.

కోడళ్లు వచ్చిన తరువాత తనకు ఇంటి పనిలో విశ్రాంతి లభిస్తుందనుకున్న సుందరి ఆశ నిరాశ అయింది. వారు ఇంటి పని ఏదీ ముట్టుకోవటం లేదు. పగలంతా గదిలో పుస్తకాలతోనూ, టీవీతోనూ కాలక్షేపం చేస్తున్నారు. సాయంత్రం నీటుగా తయారై భర్తతో సినీమాలూ, షికార్లూ తిరిగి రాత్రి పది గంటలకు ఇల్లు చేరుకుంటున్నారు. సుందరి వారికి అప్పుడు భోజనాలు పెట్టి వంటిల్లు సర్దాలి. మళ్లీ వేకువన 4 గంటలకు లేస్తేకాని పనులు తెమలవు. కొడుకులిద్దరూ

ఉదయం పదిగంటలకు లంచ్ తీసుకొని టిఫిన్ బాక్స్‌లు తీసుకొని ఆఫీసుకు వెళ్తారు. వారికి భోజనం టిఫెన్ అసరికి రెడీ చేసి పెట్టాలి.

పగటిపూట సుందరికి విశ్రాంతి సమయం మధ్యాహనం 1 గంటనుండి 2 గంటలవరకూ, ఆ సమయంలో ఆమె పత్తిఒత్తులు నలుపుతూ పెరటి వసారాలో కూర్చుంటుంది. ఓ రోజు అమె అలా కూర్చున్నప్పుడు ఒక అపురూప దృశ్యం ఆమె కంట పడింది.

ఓ గువ్వ పిట్టల జంట చూరులో గూడు కడుతున్నాయి. అవి ముక్కున సన్నని ఈనెలు, పీచు, పుల్లలు తెచ్చి గూడు నిర్మిస్తున్నాయి. గూడు కట్టి అవి అందులో గుడ్లు పెట్టి వాటిని పొదిగి పిల్లల్ని చేసేయి. ఆ పిల్లలు పొద్దస్తమానం ఆహారం కోసం ఒకటే అరుపులు, తల్లి పక్షి పగలంతా ఆహారం తెచ్చి పిల్లల నోటికి అందిస్తోంది. కొద్దిరోజులకు పిల్లలు పెద్దయ్యేయి. తల్లి పక్షి తన పిల్లలకు రెక్కలొచ్చిన సంగతి గ్రహించింది కాబోలు వాటిని గూటిలోంచి బయటకు వచ్చేలా చేసింది. పిల్లలు ఇప్పుడు ఎగరగలుగుతున్నాయి.

తల్లి వాటిని తన వెంట ఒకరోజు త్రిప్పి ఆహారం అందించి ఆ తరువాత ఆహారం అందివ్వలేదు. అవి కాస్సేపు ఆహారం కోసం గోలచేసి వాటి ఆహారం అవే సంపాదించుకోసాగేయి. పిల్లలు గూడు చేరుకోవాలని ప్రయత్నిస్తే తల్లి పక్షి వాటిని తరమివేసింది. వాటిని గూటిలోనికి మరి ప్రవేశించనీయలేదు. అవి ఎటో వెళ్లిపోయేయి. కొద్దిరోజులు అంతా తిలకించిన సుందరి మనస్సు ఎంతో బాధపడింది. ఆ విషయం భర్తకు చెప్పి జాలిపడింది.

గోపాలం చిరునవ్వు నవ్వి 'అదీ విహంగ న్యాయం'

"పక్షులకు రెక్కలొచ్చేక వాటి బ్రతుకు అవి బ్రతకాలి! కలకాలం తల్లిపక్షి ఆహారం తెచ్చి వాటిని సాకదు" అన్నాడు.

మర్నాడుదయం సుందరి తీరుబడిగా భర్త చెంత కూర్చుని కాఫీ త్రాగుతోంది.

"అత్తయ్యా! కాఫీ రడీ అయిందేమిటి? మీ అబ్బాయి బ్రష్ చేసుకొని చాలా సేపైంది!' ' అంటూ ఇద్దరు కోడళ్లూ ఒకే పర్యాయం సుందరి వద్దకు వచ్చేరు.

ప్రతిరోజూ ఆ టైమ్‌కి కాఫీ కలిపి అందర్నీ పిలిచి యిచ్చి వంటపనికి ఉపక్రమించేది అవిడ. మరి ఈ దినం ఆ విషయం పట్టించుకోనట్లు ఆవిడ సావకాశంగా భర్త చెంత కూర్చొని కాఫీ సేవిస్తూండడం చూసి వారు ఎంతో ఆశ్చర్యపోయేరు.

"వాళ్లిద్దరినీ ఓ పర్యాయం నేను రమ్మన్నానని పిలవండి!" అంది.

కోడళ్ళిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకొని వెళ్లి భర్తలను వెంట పెట్టుకొని వచ్చేరు.

"మీరిద్దరూ ఉద్యోగస్తులయ్యేరు. ఎవరి సంపాదన వారికుంది. ఇక మీరు వెంటనే మీ

భార్యలను తీసుకొని వెళ్లి వేరే కాపురం పెట్టుకోండి! మీ నాన్నగారికి వచ్చే పెన్షన్ మా ఇద్దరికీ చాలు. ఆయన రిటైర్ అయ్యేక కూడా ఎక్కడెక్కడో చాకిరీ చేసి డబ్బు తెచ్చి మిమ్మల్ని పోషించాల్సిన అవసరం లేదు! ఆయనకూ ఈ వయస్సులో విశ్రాంతి అవసరం! మీ భార్యలు కాపురానికి వచ్చింది మొదలు గత ఆరుమాసాలుగా ఇంట్లో జరుగుతున్న విషయాలన్నీ మీకు తెలుసు. ఇంటి విషయాలు ఎవరూ పట్టించుకోలేదు. మీ అందర్నీ కూర్చోబెట్టి టైమ్ ప్రకారం అన్నీ మీకు అమర్చడానికి నాకు ఇక ఓపికా శక్తిలేదు! అందువల్ల మీరు తక్షణం బయటకు వెళ్లి మీ సంసారాలు మీరు చూసుకోండి!

మరో విషయం ఈ ఇల్లు సామాన్లూ అన్నీ మీ నాన్నగారి కష్టార్జితం! ఒకవేళ మీరు ఇక్కడే వుండాలనుకుంటే ఉండొచ్చు 'పేయింగ్ గెస్ట్'గా మనిషికి నెలకు రెండు వేల రూపాయలు. ఏవిషయం నిర్ణయించుకొని ఒక నెల అడ్వాన్స్ ఇస్తే సరుకులు తెప్పించి వంట మనిషిని ఏర్పాటు చేయాలి టైమ్ ప్రకారం కాఫీ, టిఫిన్, భోజనం వగైరాలు చెయ్యడానికి. అంతే కాదు మీరు ఉన్నంటున్న పోర్షన్ నిన్న బేంక్ మేనేజర్ చూసి వెళ్లేడు. అద్దె 1500 రూపాయలు ఇస్తానన్నాడు. ఈ రోజు రమ్మన్నాం. మీరు మీనిర్ణయం చెప్తే అతనికి ఏదో ఒకటి చెప్పాలి!" అంది సుందరి ఎంతో గంభీరంగా.

ఆమె మాటలు తూటాల్లా తాకేయి వారిని!

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 19-8-1999) ✪